క్లుప్తంగా

చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: భక్తజన మండలి మహిళా బృందానికి ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ యామ కవిత దయాకర్‌తో కలిసి చీరలను పంపిణీ చేశారు. కొన్ని రోజులుగా రమేష్ చారి అధ్వర్యంలో 54మంది మహిళలు జడ కోలాటంలో శిక్షణ పొందుతున్నారు. వారికి అవసరమైన చీరలను ఇవ్వాలని గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌ను కోరారు. స్పందించిన సుఖేందర్‌రెడ్డి వారికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయితగోని స్వామిగౌడ్, ఎస్ వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, చిలుకరాజు శ్రీనివాస్, సురిగి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనం విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు



మాట్లాడుతున్న మాదిగ జేఏసీ నాయకులు

నల్లగొండ టౌన్ : నల్లగొండలో శనివారం నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును విజయవంతం చేసిన విద్యార్థులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు, కార్మికులు, కర్షకులు, మాదిగ -మాదిగ ఉప కులాల సంఘ ప్రతినిధులకు మాదిగ జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసేంత వరకు పోరాటాలు చేయాలన్నారు. సమావేశంలో బొర్ర సుధాకర్, కత్తుల జగన్‌కుమార్, పెరిక కరణ్ జయరాజ్, పెరిక అంజయ్య, కత్తుల సన్నీ, చింత శివరామకృష్ణ, కందుల మోహన్, దుబ్బా సత్యనారాయణ, లింగస్వామి, బుర్రి స్వామి, బొజ్జ నరసింహ, పందుల హరిప్రసాద్, వీరస్వామి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సోషల్ మీడియా కన్వీనర్‌గా విజయ్‌కుమార్



చిట్యాల: పీఆర్‌టీయూ టీఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా చొక్కారపు విజయ్‌కుమార్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్లం దామోదర్ ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థులు శ్రీపాల్‌రెడ్డి, వంగా మహేందర్‌రెడ్డి విజయానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు.

నిత్యావసర సరుకులు అందజేత



పేదలకు సరుకులు అందజేస్తున్న శ్రీసత్యసాయిబాబా సేవా మండలి సభ్యులు

చిట్యాల: మున్సిపాలిటీ పరిధి తొమ్మిదవ వార్డులోని పలువురు పేదలకు ఆ వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య ఆధ్వర్యంలో శ్రీసత్య సాయిబాబా సేవా మండలి సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో చేతిని కోల్పోయిన దండిగ నర్సింహ, భర్తను కోల్పోయిన ఎం.డి.సఫియాకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సేవా మండలి సభ్యులు మేడిశెట్టి రూప్సీ, నాగలక్ష్మి, మేడిశెట్టి అంజయ్య, వెలుపల్లి వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి చంద్రశేఖర్, చింతపల్లి భిక్షం, తూర్పునూరు మల్లేష్, కొంపెల్లి రవి, మత్స్యగిరి పాల్గొన్నారు.

మహాసభల ప్రచార పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చిట్యాల: మిర్యాలగూడలో డిసెంబర్ 2న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభ, 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ చిట్యాల మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి కోరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం ఆ మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామశాఖ కార్యదర్శి కత్తుల యాదయ్య, నాయకులు జహంగీర్, పెన్నింటి నారాయణరెడ్డి, సోహెల్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు

- అధ్వానంగా లింక్ రోడ్లు
- మరమ్మతులు చేపట్టని పాలకులు
- ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజల ఆవేదన



వర్షాకాలంలో కేతేపల్లి-చెర్కుపల్లి గ్రామాల మధ్య లింక్ రోడ్డు ఇలా..(ఫైల్)



కంకర తేలి అధ్వానంగా ఉన్న కేతేపల్లి- కొండకిందిగూడెం లింక్ రోడ్డు

కేతేపల్లి: అడుగడుగునా గుంతలు.. ఆపై కంకర తేలడంతో మండలంలోని వివిధ గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్లు అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు చేపట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోకపోవటంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అనుబంధ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 16 గ్రామ పంచాయతీలు, మరో ఆరు వరకు ఆవాస గ్రామాలు ఉన్నాయి. వీటిలో దాదాపు సగం గ్రామాల ప్రజలు ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్లేందుకు, నాలుగైదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి అనుబంధ రోడ్లను వినియోగిస్తున్నారు. చెర్కుపల్లి-కేతేపల్లి మధ్య దూరం కేవలం 4కి.మీ మాత్రమే. ఈ రెండు గ్రామాల వ్యవసాయ భూముల కలిసే ఉంటాయి. ఈ దారి వెంట ప్రతిరోజు రెండు గ్రామాల రైతులు, గీత కార్మికులు, ప్రజలు వెళ్తుంటారు. దారి సరిగా లేకపోవటంతో చెర్కుపల్లి ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి తుంగతుర్తి, ఉప్పలపహాడ్, చీకటిగూడెం గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాలకు కొత్తపేట గ్రామం నుంచి నిత్యం దాదాపు 50మంది విద్యార్థులు సైకిళ్లపై వెళ్తుంటారు. రెండు గ్రామాల మధ్య మూడు కి.మీ మేర ఉన్న లింక్‌రోడ్డు మట్టి రోడ్డు కావటంతో వర్షాకాలంలో గుంతలు ఏర్పడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండకిందిగూడెం-కేతేపల్లి మధ్య దూరం 6కి.మీ, తుంగతుర్తి-కేతేపల్లి మధ్య దూరం 5కి.మీ, గుడివాడ నుంచి మూసీ కుడి ప్రధాన కాల్వ వరకు 2 కి.మీ. మాత్రమే ఉంటుంది. కానీ ఈ అనుబంధ రహదారులు అభివృద్ధికి నోచుకోక పోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నిధుల మట్టిపాలు

గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్ల మరమ్మతులకు స్థానిక ప్రజాప్రతినిధులు అడపాదడపా నిధులు ఖర్చు చేస్తున్నా అవి మట్టి పాలవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మెటల్ రోడ్లతో పాటు మట్టి రోడ్లపై తాత్కాలికంగా ట్రాక్టర్లతో మట్టిని పోసిస్తున్నారు. వర్షాకాలంలో ఆయా రోడ్లు బురదగా మారి ప్రజలకు మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. శాశ్వతంగా పరిష్కారం చూపక పోవటంతో ప్రజాప్రతినిధులు ఖర్చు చేస్తున్న నిధులు మట్టి పాలవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.

బీటీరోడ్డు నిర్మించాలి



గుడివాడ నుంచి మూసీ కాల్వ వరకు గల దారిలో గుంతలు ఏర్పడి నడవటానికి సైతం ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డంతా బురదమయంగా మారింది. రాత్రివేళ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి బీటీ రోడ్డు నిర్మించాలి.

– ఏపూరి జగన్నాథం, గుడివాడ

ఎన్‌సీసీతో దేశభక్తి పెంపొందుతుంది



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామగిరి(నల్లగొండ): ఎన్‌సీసీతో దేశభక్తి పెంపొందుతుందని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండ ఎన్జీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం పట్టణంలోని హిమాలయ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిరాశ్రయులైన పేదలకు భోజనం ప్యాకెటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సమాజ సేవ, ఐక్యత చాటాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీ స్థాపించారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా సైనిక శిక్షణ, నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

నేడు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం



పోస్టర్ విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో డిసెంబరు 23న నిర్వహించే పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయడానికి సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక యాదవ భవన్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం ఉదయం 8గంటలకు ఎన్జీ కాలేజీ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నందున పెద్ద సంఖ్యలో బీసీలు తరలిరావాలని కోరారు. అంతకుముందు బీసీల సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి నారాయణయాదవ్, ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, తిరందాసు రామదాసు, నాయకులు మునాస ప్రసన్నకుమార్, గుండు వెంకటేశ్వర్లు, చెన్నోజు భరద్వాజ్, వల్లకీర్తి శ్రీనివాస్, మోదాల శ్రీనివాసయాదవ్, వడ్డెబోయిన రామకృష్ణ, తిరుపతయ్యగౌడ్, మంగలపల్లి శంకరయ్య, అల్లి చంద్రయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని 28,29 తేదీల్లో ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నల్లగొండ టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈ నెల 28, 29 తేదీల్లో మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోలే సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో నీరుడు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వంట షెడ్లు లేని చోట వెంటనే నిర్మించి ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీని పెంచి ఒక్కో విద్యార్థికి స్లాబ్ రేటు రూ.25 నిర్ణయించి అమలు చేయాలని అన్నారు. సమావేశంలో యూనియన్ ప్రచార కార్యదర్శి కోలేటి ముత్తమ్మ, సరిత, అంజమ్మ, కొల్లి రాములు, యాదమ్మ, అలివేలు, సైదమ్మ, సునీత, అండాలు, ప్రమీల, పూలమ్మ, అంతమ్మ పాల్గొన్నారు.

డిసెంబర్ 1న మాలల 'సింహగర్జన'

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లో డిసెంబరు 1న మాలల సింహ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కంచి మధుసూదన్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం సింహగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు, అద్దంకి రామకోటి, రేకల సైదులు, బొగరి విజయ్ కుమార్, యాదగిరి, గాలి రవికిషన్, చింతమల రమేష్,యాదగిరి, రవీందర్, పాల్గొన్నారు.

సర్వే వివరాలు వేగవంతంగా నమోదు చేయాలి

నల్లగొండ రూరల్: సమగ్ర కుటుంబ సర్వే వివరాల డాటా ఎంట్రీని వేగవంతంగా పూర్తి చేయాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలించారు. ఎప్పటికప్పుడు పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా డాటా ఎంట్రీ చేయాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై హర్షం



కట్టంగూర్ : సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



చిట్యాల : సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రఘుమారెడ్డి

చిట్యాల: నకిరేకల్‌కు ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం చిట్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుతో పేదలకు అవసరమైన కార్పొరేట్ విద్య అందుతుందన్నారు. స్కూల్ ఏర్పాటుకు సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తిరుగుడు రవి, దామనూరి పృథ్వీ, కోసనం అశోక్, దాదె ఉపేందర్‌రెడ్డి, జిల్లా పృథ్వీ, రెముడాల నర్సింహ, సయ్యద్ ఇమ్రాన్, అందె చందు, జక్కలి రాజు, బుల్లెట్ మహేష్, అందె శివ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

కట్టంగూర్ : నకిరేకల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను మంజూరు చేయటం పట్ల యూత్ కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు రెడ్డిపల్లి వీరస్వామి మాట్లాడుతూ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరశంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు రెడ్డిపల్లి వీరస్వామి, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాపుగంటి నరేష్, ఐతగోని సైదులు, కొలిపాక సురేందర్, కొంపెల్లి శ్రీకాంత్, రెడ్డిపల్లి నాగరాజు, చెరుకు శివ, గణేష్, దాసరి కిరణ్, మేకల హరిబాబు, వంశీరెడ్డి, సురేష్ ఉన్నారు.

కేతేపల్లి: నకిరేకల్ నియోజకవర్గంలో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు మున్న అశోక్, తరుణ్, ఫణి, అఖిల్, నాగరాజు, నరేష్, ప్రణయ్, గౌతమ్, సందీప్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

చండూరు : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఎన్నికల ఇంచార్జి కట్ట సుధాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం గట్టుప్పల్‌లో నిర్వహించిన మునుగోడు అసెంబ్లీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించిందని తెలంగాణలో సైతం అధికారంలోకి రాబోతున్నామన్నారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న భిక్షమయ్యకు రూ.10వేల నగదు అందజేశారు. అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాసాల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువుమట్టి తరలింపు అడ్డగింత



అప్పాజిపేట గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న కానిస్టేబుల్

నల్లగొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణానికి వినియోగించేందుకు తరలిస్తున్న చెరువు మట్టిని ఆదివారం నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పాజిపేటలో కాకి చెరువు మట్టిని నేరడ-అప్పాజిపేట మధ్య డబుల్ రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ వినియోగిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు వెళ్లిపోయిన తర్వాత యథావిధిగా మట్టి తరలింపు టిప్పర్ల ద్వారా నడిచిందని పేర్కొన్నారు. 30-40 ఫీట్ల లోతులో చెరువు మట్టిని తవ్వి రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చెరువు మట్టిని అధిక లోతులో తీస్తే బోర్లు వట్టిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టి రోడ్డు నిర్మాణానికి మళ్లించడంలో అధికార పార్టీ నాయకుల సహకారం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

● ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మునుగోడు: మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 విద్యా సంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి గుర్తులను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె గ్రామంలో ఇటీవల మృతిచెందిన మాదు నర్సింహ, శివరాత్రి చంద్రమ్మల కుటుంబాలను ఆదివారం రాత్రి మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు ఆలేటి శ్రీనివాసులు పరామర్శించారు. బాధిత కుటింబీకులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయనవెంట బాకి వెంకటయ్య, లింగాల శ్రీను, శివరాత్రి దేశి, శ్రీను, శ్రీను, సాయి ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఆలేటి శ్రీనివాసులు

నేత్రదానం అభినందనీయం



కృష్ణయ్య మృతదేహం నుంచి కార్నియా సేకరిస్తున్న వైద్యుడు

శాలిగౌరారం: నేత్ర దానం అభినందనీయమని పలువురు వైద్యులు అన్నారు. శాలిగౌరారం మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన గుండా కృష్ణయ్య(91) వయోభారంతో ఆదివారం మృతిచెందారు. అతడి కుమారులు గుండా శ్రీనివాసులు, రాము, లక్ష్మణ్, కుమార్తెలు సుగుణమ్మ, సుధర్మలు తమ తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకువచ్చారు. విషయం తెలుసుకున్న నల్లగొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు హరినాథ్, కార్యదర్శి పిచ్చయ్యలు హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ కంటి సమాచారం ఇవ్వడంతో వైద్యులు పుల్లారావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితారాణి, రమేశ్‌లు గురుజాలకు వచ్చి గుండా కృష్ణయ్య కంటి కార్నియా సేకరించారు. కృష్ణయ్య మృతదేహాన్ని పలువురు రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి

చండూరు(గట్టుప్పల్) : సీపీఎం మండల సీనియర్ నాయకుడు ఖమ్మం గాలయ్య (56) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఆయన మృతదేహానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, నాయకులు కర్నాటి మల్లేశం, బొట్ట శివకుమార్, శ్రీశైలం, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, రబ్బాని, నగేష్ సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో గాయత్రి మహాయజ్ఞ మహోత్సవాన్ని ఆదివారం ఆంజనేయ స్వామి మాలధారులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వాములు మురళి గురుస్వామి నేతృత్వంతో 12 కలశాలను ఊరేగించారు. అనంతరం ఆంజనేయస్వామికి 12మెట్ల పూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆంజనేయస్వామి ప్రధాన గురుస్వామి మురళి, ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరామ చరణ్ రామచంద్రన్ వేత, గురుస్వాములు దస్రు, చిట్టిబాబునాయక్, గుంజ, ముత్యాలు, ధనావత్ చిన్న, విజయ్, పఠాని కృష్ణ, వర్కాల సురేష్, రంగా, లావూరి శ్రీను, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి తదితరులున్నారు.

శాంతినగర్‌లో పుష్కర హోమం

మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులో గల శాంతినగర్ శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పుష్కర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సాయిలు, ఇరువేంటి రవీందర్, ఉప్పల శ్రీనివాస్, ఉమాకర్‌రెడ్డి, మందడి లక్ష్మమ్మ, మాధవరావు, జనార్ధన్, శ్రీనివాసులు, సైదులు, గోవర్ధన్, విష్ణు, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ఆంజనేయస్వామి కలశాలను ఊరేగిస్తున్న మాలధారులు

స్తంభాన్ని తొలగించరూ..



కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం

మునుగోడు: మేజర్ గ్రామ పంచాయతీ మునుగోడు పరిధిలోని లక్ష్మీదేవిగూడెంలో 15ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటు స్తంభం తప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ స్తంభాని తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆ స్తంభాన్ని తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తే బలమైన గాలులు వీస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆ గ్రామ ప్రజలు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని స్తంభాన్ని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు

- గతంతో పోలిస్తే తిప్పర్తి మండలంలో తగ్గిన వరిసాగు
- సీజన్ ప్రారంభంలో మిల్లర్లకు అమ్ముకున్న రైతులు



తిప్పర్తి మార్కెట్ యార్డులో ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు

తిప్పర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగింపు దశకు వచ్చింది. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయకపోవడంతో తిప్పర్తి మండలంలో వానాకాలం సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం కూడా తక్కువగా వచ్చింది. తిప్పర్తి మండలంలో మొత్తం 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు.

మొత్తం 16 కొనుగోలు కేంద్రాలు

తిప్పర్తి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 9, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 43వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. గత వానాకాలం సీజన్‌లో 75 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో 45వేల క్వింటాళ్లు, వానాకాలం సీజన్‌లో దాదాపు 60వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

రెండువేల ఎకరాల్లో తగ్గిన వరిసాగు

వర్షాభావ పరిస్థితులు, వరి కోతల ప్రారంభ సమయంలో రైతులు మిల్లులకు అధికంగా తరలించడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ తగ్గింది. సన్న ధాన్యం 90 శాతం మేర మిల్లులకు అమ్ముకున్నారు. గత వానాకాలం సీజన్‌లో మండలవ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా ఈ సంవత్సరం వానాకాలంలో 28 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రెండు వేల ఎకరాల్లో వరిసాగు తగ్గింది. 13 వేల ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువుల్లో నీరు లేక రైతులు వరిసాగు చేయడం కొంతమేర తగ్గించారు.

సాగు విస్తీర్ణం తగ్గింది

వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు తగ్గడంతో రైతులు వరి సాగు ఎక్కువగా చేయలేదు. గత సీజన్ కంటే ప్రస్తుత సీజన్ వరిసాగు మండల వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో తగ్గింది. కొనుగోలు కేంద్రాల్లో కూడా ధాన్యం సేకరణ గత సీజన్ కంటే ఈ సీజన్‌లో తగ్గింది. దీనికి తోడు అన్నదాతలు సన్నరకం ధాన్యం ఎక్కువ మొత్తంలో మిల్లుల్లోనే అమ్ముకున్నారు.

–సన్నిరాజు, ఏఓ, తిప్పర్తి